# చెన్నూర్ చైతన్యం చూపండి..

- ఎట్లా కనబడుతున్నరు ప్రజలు.. అంగడి సరకులెక్క కొడుతున్నరా..
- కాళేశ్వరం బ్యాక్ వాటర్‌లో భూములు మునిగే రైతులకు న్యాయం చేస్తాం..
- సుమన్ చేతిలోనే వివేక్ ఓటమి, ఆయన రాజకీయ జీవితానికి సమాధి కట్టడం రాసి ఉంది..
- గుర్తు పెట్టుకోండి కాంగ్రెసోళ్ల సంగతి చెప్తాం..
- చెన్నూర్ 'ప్రజా ఆశీర్వాద ర్యాలీ'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

మంచిర్యాల, నవంబర్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెసోళ్లకు బాగా పైసలు ఎక్కువైనయ్. ఆడ, ఈడ సంపాదించి ఓటుకు రూ.10 వేలు ఇస్తరట. ఇస్తే బరాబర్ తీసుకోండి.. ఏం బాధ లేదు. ప్రమాణం చేయమంటరు చేయండ్రి.. చెయ్యి చాపి ప్రమాణం చేస్తూ మనసులోనే తుప్పాల్.. తుప్పాల్.. తుప్పాల్ అనుకోండ్రి.. గుద్దుడు మాత్రం కారు గుర్తుకే అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద ర్యాలీ'లో కేటీఆర్ మాట్లాడారు. పేపర్లు పెట్టి, టీవీలు పెట్టి పైసలు ఎక్కువై చెన్నూర్‌లో పదిహేను రోజుల ముంగట వచ్చి పైసలు చల్లి గెలుస్తా అంటే బలుపు కాకపోతే.. ఏంది నాకు తెల్వక అడుగుతా అంటూ మండిపడ్డారు. చెన్నూరోళ్లు ఎట్ల కనబడుతున్నరు.. ఇక్కడి ప్రజలు అంగడి సరకు లెక్క కొడుతున్నరా.. ఒక్కసారి చూపెట్టండి.. మీ దెబ్బ చూపెట్టండి.. అని పిలుపునిచ్చారు. ఆ కాంగ్రెస్ ఆయన(వివేక్)కు మనోడి(సుమన్) చేతిలో ఓడిపోవుడు రాసి ఉన్నది. రాజకీయ జీవితం సమాధి అవుడు రాసి ఉన్నదని స్పష్టం చేశారు.

### భూములు మునుగుతున్న రైతులకు న్యాయం చేస్తాం..

అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయని కాంగ్రెస్ సన్నాసులు.. ఇవాళ వచ్చి మేం అది ఇస్తాం, ఇది ఇస్తాం.. మోచేతికి బెల్లం పెడుతాం.. మాకు ఓటేయండి అని అడుగుతరు. వీళ్లు ఇవాళ వచ్చి చాలా చెప్తరు.. బుదరకిస్తరు.. బ్రతిమిలాడుతరు. కాళ్లు పట్టుకుంటరు.. మూడో తారీఖు తర్వాత ఇక్కడ ఉండేది మాత్రం సుమన్ ఒక్కడే అన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచేది సుమనే అని తెలిపారు. అక్కడ ముఖ్యమంత్రి కేసీఆరే.. ఇక్కడ ఎమ్మెల్యే సుమనే.. అన్నారు. ఎవరో వాళ్లొకరు, వీళ్లొకరు ఊళ్లే అమ్ముడు పోయినోళ్లు ఆగమాగం చేస్తే ఆగం కావొద్దన్నారు. 75 ఏండ్ల భారత స్వాతంత్ర్య చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని కార్యక్రమాలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్నది ముఖ్యమంత్రి కేసీఆర్ అని గుర్తు చేశారు. రైతుబంధు ఇచ్చింది, ప్రాజెక్టులు కట్టింది, మంచి పనులు చేసింది.. కేసీఆర్ ఒక్కరే అని స్పష్టం చేశారు. మా తమ్ముడు సుమన్ కాళేశ్వరం బ్యాక్ వాటర్‌లో కొన్ని భూములు మునుగుతున్నాయని చెప్పారన్నారు. దానికి సంబంధించి శాశ్వత పరిష్కారం కావాలే.. అయితే కరకట్టలు కట్టాలే లేదా ఆ రైతులకు పైసలు ఇయ్యాలే అని మీకు మాట ఇస్తున్నా.. తమ్ముడిని పెద్ద మెజార్టీతో గెలిపియ్యండి.. ఆ సమస్య పరిష్కారం నేను చూపిస్తా. ఎవ్వరు చెప్పిన వినకండి, కాంగ్రెస్ లంగలు చెప్తే అసలు వినకండి. మీరు సుమన్‌ను గెలిపిస్తే ఆ సమస్య పరిష్కారం చేసే బాధ్యత నాది అని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు.

### కరెంట్ కావాల్నా.. కాంగ్రెస్ కావాల్నా..

30వ తేదీన ఓటు బటన్ ఒత్తె ముందు ఒకటే ప్రశ్న మనసులో అడగండి. కరెంట్ కావాల్నా... కాంగ్రెస్ కావాల్నా ఆలోచించుకోండి.. ఎందుకంటే కరెంట్ కావాలంటే కాంగ్రెస్ ఉండద్దు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదు. ఇందులో ఏం అనుమానం లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇదే చెన్నూర్‌లో సరిగ్గా పదేళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏంది కరెంట్ పరిస్థితి. ఊళ్లే ఒక రైతు సచ్చిపోయినా, సుట్టపోడు సచ్చిపోయినా, పెద్ద మనిషి సచ్చిపోయినా.. మనమే కదా కరెంటోళ్లకు ఫోన్ చేసి బతిమిలాడుకున్నం. ఒక 20 నిమిషాలు కరెంట్ ఇయ్యండని బతిమిలాడుకున్న రోజులు వాస్తవమేనా.. నిజమేనా.. ఒక్కసారి గట్టిగ కాంగ్రెస్ నా కొడుకులకు సిగ్గు వచ్చేలా చప్పట్లు కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ రోజు రేవంత్‌రెడ్డి మళ్లీ వచ్చి కరెంట్ ఎక్కడ ఉంది. నాకు కనబడుతలేదు.. ఏడున్నది కరెంట్ అంటున్నాడని, నాకు తెల్వక అడుగుతున్నా నాకు తెలివిలేదు. కానీ.. చెన్నూరోళ్లు తెలివైనోళ్లు కదా.. కరెంట్ కనబడతాది కండ్లకెవరికైనా.. అదేమన్న మనిషా కనపడేందుకు.. అని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి బాగా అనుమానాలున్నయ్. ఇక్కడ పోటీ చేసేటాయనకు కూడా బాగా అనుమానాలున్నాయన్నారు. అందుకే మా తమ్ముడు సుమన్‌కు నేను చెప్తున్నా.. రెండు ఏసీ బస్సులు పెడుదాం.. ఓల్వ బస్సులు పెడదాం. మొత్తం ఈ జిల్లాలో ఉన్న కాంగ్రెసోళ్లను అండ్ల ఎక్కించండి. రేవంత్‌రెడ్డిని కూడా ఎక్కించుకోండి. బస్సులో బిర్యానీ పొట్లాలు కూడా పెడతాం.. బాధపడకండి. మంచిగా కూసోని తినండి. చెన్నూర్ నియోజకవర్గంలో ఏ మండలానికి పోతరో మీ ఇష్టం.. ఏ ఊరికి పోతరో మీ ఇష్టం.. ఏ టైంకి పోతరో అది కూడా మీ ఇష్టం.. ఎక్కడికికైనా పోయి వరుసగా లైన్ కట్టి నిలబడి గట్టిగా కరెంట్ తీగలను బిగవట్టుకోండి. కరెంట్ వస్తదో, వస్తలేదో మీకే ఎరుకైతది. రాష్ట్రానికి కూడా దరిద్రం పోతది. అని మంత్రి కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెసోళ్లకు కరెంట్ గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా.. సిగ్గు శరం ఉందా అని మండిపడ్డారు. మీరున్నప్పుడు ఆరు గంటల కరెంట్ అన్నరు.. ఏన్నడైనా మూడు గంటలు సక్కగ ఇచ్చిండ్రా.. మరి ఇవాళ గా ఇజ్జత్ లేనోళ్లకు ఓటేద్దామా.. గా దౌర్భాగ్యపు పార్టీకి ఓటేద్దెమా.. మళ్లీ ఆ దరిద్రాన్ని తెచ్చుకొని నెత్తిన పెట్టుకుందామా.. యాదికి పెట్టుకోండి.. దరిద్రానికి నేస్తం హస్తం.. అది భస్మాసుర హస్తం.. నెత్తిన పెట్టుకుంటే మాడి మసైపోతమని హెచ్చరించారు.

### గెలిచాక కాంగ్రెసోళ్ల సంగతి చెప్తాం..

ఈ టర్మ్‌లో కరోనా వచ్చి రెండేళ్లు అందరం మూతికి బట్టలు కట్టుకొని తిరిగినం. మరి మా తమ్ముడు బాల్క సుమన్ మొత్తం టర్మ్ అన్న పని చేసిండా అంటే అదీ లేదు. ఆ రెండేళ్లు తీసేస్తే మిగిలిన మూడేళ్లలో ఎట్ల మార్చిండు చెన్నూర్‌ను పక్కనున్న మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ వాళ్లు అందరూ అసూయ పడేలా మార్చుకున్నడు అని కేటీఆర్ అన్నారు. సుమన్.. కేసీఆర్ ఇంట్ల కుటుంబ సభ్యుడు, కేసీఆర్ కొడుకులా ఉంటడు. కేసీఆర్ నీడలెక్క వెంటనే ఉంటడు. పార్టీ పని చెబితే మొత్తం మహారాష్ట్ర, ఆ రాష్ట్రం.. ఈ రాష్ట్రం.. అంతట తిరుగుతడు. ఉషారోడు కాబట్టి పార్టీ పని చెస్తడు.. అదే సమయంలో చెన్నూర్‌కు మంచి చేస్తడు. ఒకదిక్కు ఇటు చెన్నూర్ చూసుకుంటూ మూడేళ్లలో గిన్ని పనులు చేసిండు.. బయట పార్టీ కోసం పని చేస్తున్నడు.. గివన్నీ చేస్తుంటే వాడెవడో బయటోడు ఎలక్షన్‌కు 11 రోజుల ముంగట వచ్చి సుమన్ ఇక్కడ ఉండడు అంటున్నడట.. నేను అడుగుతున్నా ముప్పై ఏండ్లలో మూడు రోజులు ఉండెన వాళ్లు ఎవలన్నా ఇక్కడా ? అని ప్రశ్నించారు. మరి ఇవాళ వాళ్లు వచ్చి మాట్లాడవచ్చునా.. ఆడ, ఈడ సూట్‌కేసులు పట్టుకొని దిగి వానికి పైసలిచ్చి, వీనికి పైసలిచ్చి కొనేస్తే ఆగమైదమా.. మారితే మారుతరు కావచ్చు కొంత మంది లంగలు, పైసలకు అమ్ముడుపోయే సన్నాసులు ఉంటరు. మనం మారుతమా ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ నాయకులకు చెప్తున్నా.. మీరు పైసలు ఎక్కువై బలిసి కొట్టుకుంటున్నరు. డిసెంబర్ 3 తరువాత ఎవలెవలైతే ఇక్కడ డ్రామాలు, నకరాలు చేస్తున్నరో కాంగ్రెసోళ్లు వాళ్ల సంగతి చెప్పే బాధ్యత కూడా మాదే. పక్కా చెప్తున్న ఇది రాసి పెట్టుకోండి. వాళ్ల సంగతి చెప్పుడు పక్కా.. ఇంకొక రెండు రోజులే ఉంది జెర్ర బిగ పట్టుకొని ఉండండంటూ కేటీఆర్ చురకలు అంటించారు.

### దళితబంధు అందరికీ వస్తది..

దళితబంధు మంచి ప్రొగ్రామ్. ఏమైతుందంటే కొంత మందికి వచ్చింది కొంత మందికి రాలేదు. ఇది ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం కాబట్టి అందరికీ జల్ది రావాలనే ఆరాటం ఉంటుందని కేటీఆర్ అన్నారు. మనం బంతి భోజనానికి పోతే నాలుగు వరుసల్లో కూర్చున్నం అనుకో మొదాలు ఉన్నోళ్లకు మొదాలు వస్తది, ఆఖర్ల ఉన్నోళ్లకు ఆఖరికి వస్తది. వచ్చుడు పక్కా.. గట్లనే దళితబంధు కూడా అందరికీ వస్తుందన్నారు. సుమన్ కేసీఆర్ కుటుంబ సభ్యుడు అంటే వడ్డించేటోడే మీ వాడు బంతిలో ఏడు కూసున్నా పూలుగు బొక్క పడుతదా.. పడదా.. కచ్చితంగా పడుతదన్నారు. దళితబంధు కూడా ప్రతి ఇంటికీ వస్తది. అది ఇప్పించే బాధ్యత నాది అన్నారు. చాలా మంది నాతో చెప్తున్నరు. గులిగినా అలిగినా నారాజ్ అయినా మీ మీదే అయితం అంటున్నరు. నడిచే ఎద్దునే పొడుస్తడు ఎవ్వడైనా పండుకున్న దున్నపోతునైతే పొడవడు కదా అంటున్నరు. మళ్ల గెలిచేది మీరే, వచ్చేది మీ సర్కారే కాబట్టి మిమ్ములనే అడుగుతాం.. మీతోనే చేయించుకుంటాం అంటున్నారు. గులుగుతం. అలుగుతం.. కానీ గులుగుడు గులుగుడే.. కారు గుర్తుకు గుద్దుడు గుద్దుడే.. అని చెప్తున్నరన్నారు. సరే మా చెన్నూర్ మంచిగైంది. చెట్లు మంచిగ పెట్టిండ్రు. కానీ.. నాకు గిది ఇయ్యకపోయే అనేది ఒకటి ఉందన్నారు. అందుకే నేను అందరికీ ఒక్కటే చెప్తున్నానని కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు జనవరి నెలలోనే ఇచ్చుకుందామన్నారు. ఎవ్వలు రంది పెట్టుకోకండి. తప్పకుండా ఇప్పించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. డిసెంబర్ 3 తరువాత 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలందరికీ కల్యాణలక్ష్మి లెక్కనే సౌభాగ్యలక్ష్మి అనే కార్యక్రమం తెస్తున్నామని నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పారు. ఇప్పుడున్న ఆసరా పింఛన్లు కూడా రూ.2 వేల నుంచి రూ.5 వేలు పెంచుతామన్నారు. రేషన్‌కార్డు ఉన్నోళ్లందరికీ సన్నబియ్యం, రూ.5 లక్షల బీమా ఇస్తామన్నారు. ఇవాళ రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని సుమన్ మళ్లీ గెలిస్తే రూ.15 లక్షలు చేసుకుంటామన్నారు. అసైన్డ్ భూములున్న రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తామని చెప్పారు. మేమేమో మాకు ఓటు వేసినందుకు ఐదేళ్లలో చెన్నూర్‌ను ఎట్ల చేసినమో చెప్తున్నామని, మళ్ల గెలిస్తే ఏం చేస్తమో చెప్తున్నాం. మరి కాంగ్రెసోళ్లు ఏం చెప్తున్నరు. మూడు గం టల కరెంట్ ఇస్త అని ఒకడు చెప్తడు. రైతుబంధు ఎత్తేస్తా అని ఒకడు చెప్తడు. ఇంకో పుణ్యాత్ముడు ఊర్లకు మళ్ల పట్వారీలను తీసుకొస్తామని చెప్తున్నడు. పట్వారీలు కావాల్నా మళ్ల ఊళ్లళ్ల.. దళారులు కావాల్నా.. రైతుల నెత్తి మీద కూసొని మళ్ల మన బతుకులను ఆగం చేసే దరిద్రం కావాల్నా.. ఆలోచించుకోవాలన్నారు. అందుకే నేనడుగుతున్నా.. మిమ్ములందరినీ బ్రహ్మాండంగా ఈ రోజు చెన్నూర్‌ను అభివృద్ధి చేసుకుంటున్నాం. తెలంగాణను బాగు చేసుకుంటున్నాం. భవిష్యత్‌లో ఇంకా బాగా చేయాలి అనుకుంటున్నామన్నారు. అవతలోళ్లు డబ్బులను నమ్ముకున్నరు. చెన్నూర్‌లో ఓటుకు రూ.10 వేలు ఇస్తరట.. మంచిగ తీసుకోండి నేను వొద్దు అంటలేను. మీ నోటి కాడి బుక్క నేను గుంజుకొను కనీ.. ఓటు కారు గుర్తుకే వేయండి అని చెప్పారు. మోసాన్ని మోసంతోనే జయించాలే. ముళ్లును ముళ్లుతోనే తీయాలే. ఏం బాధ పడొద్దు. అవేం వాళ్ల సొంత పైసలు కాదు. కర్ణాటక నుంచి, అక్కడి నుంచి ఇక్కడి నుంచి వచ్చిన దొంగ పైసలే.. వాటికి ప్రమాణాలు, ఇమానాలు ఏం ఉండయ్. అందుకే మంచిగ తీసుకొని కారు గుర్తుకు ఓటేయండి అని పిలుపునిచ్చారు. ఎంపీ వెంకటేశ్ నేతకాని, మాజీ మంత్రి బోడ జనార్దన్, రాజా రమేశ్, సొత్కు సంజీవ్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాల్క సుమన్

## లీడర్లను అంగట్లో సరుకుల్లా కొంటున్నడు

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిది డబ్బుందనే అహంకారం
- చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

చెన్నూర్, నవంబర్ 27: చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లీడర్లను అంగట్లో సరుకుల్లా కొంటున్నాడని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాల్క సుమన్ మండిపడ్డారు. చెన్నూర్‌లో సోమవారం మంత్రి కేటీఆర్ పాల్గొన్న రోడ్ షోలో బాల్క సుమన్ ప్రసంగిస్తూ .. కాంగ్రెస్ అభ్యర్థి డబ్బుందనే అహంకారం ఉందని చెప్పారు. నియోజకవర్గంలో గత ఐదేండ్లలో అభివృద్ధి, సంక్షేమ పనులు పెద్ద ఎత్తున చేపట్టి, ఈ రోజు మళ్లీ గెలిపించాలని కోరుతున్నానని చెప్పారు. నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల్లోకి ప్రచారం కోసం వెళ్తే.. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్ ఆశ్వీరాదంతో నియోజకవర్గాన్ని మంచి అభివృద్ధి చేసుకునేందుకు మరోకసారి అవకాశం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో తనపై ఇప్పుడు పోటీ చేస్తున్న వ్యక్తి ఒక్క సారి ఎంపీగా ఉన్నాడని, వ్యక్తి అన్న గతంలో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే, మంత్రిగా పని చేశాడని, తండ్రి కేంద్ర మంత్రిగా ఉన్నాడని గుర్తు చేశారు. ఎన్నికల కోసం సూటు కే సులు పట్టుకొని వచ్చి ఇక్కడి రాజకీయాలను కలుషితం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మైకు దొరికతే చాలు తనను ఇష్టం వచ్చినట్టు తిట్టుతున్నారనిఅన్నారు. ఆయనతో పాటు భార్య, కొడుకు, బిడ్డ, కోడలు, అల్లుడు ఆయన విశాఖ కంపెనీ ఉద్యోగులు, ఆయన చానల్, పేపర్ తనను తిడుతున్నారని పేర్కొన్నారు. ఆయన వ్యవస్థ మొత్తం తన మీద పడిందని చెప్పారు. మందపై తోడెళ్లు పడ్డట్టు ని యోజకవర్గంపై పడి ఇష్టారాజ్యంగా డబ్బు-అహంకారంతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అటువంటి వ్యక్తులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే చెన్నూర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని, ఈ అభివృద్ధి యజ్ఞం ఇలానే కొనసాగాలంటే మరోసారి కేసీఆర్ ము ఖ్య మంత్రి కావాలని, కేసీఆర్ నాయకత్వంలో చెన్నూర్ నియోజకవర్గం బ్రహ్మాండంగా ఎదగాలంటే మీ అందరి దీవెనలు తనకు ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, టీబీజీకేఎస్ నాయకుడు కెంగర్ల మల్లయ్య, మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే సోత్కు సంజీవరావు, నాయకులు రాజారమేశ్, అందుగుల శ్రీనివాస్, చెన్నూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అర్చనాగిల్డా, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

CHANGE OF NAME

★ I, VEDANTHAM PURSHOTTAMA CHARYULU, R/o. 20-530/2, Ramalayam, A-Zone, Ramakrishnapur, Mancherial-504 301. Changed My Name as VEDANTHAM PURUSHOTHAMA CHARYULU, S/o. Vedantham Jagannadha Charyulu.
NT-313029

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677